# సూక్ష్మంలో మోక్షం

జి.వి.జి.

"డిటెక్టివ్ కథలు రాయడం చాలా తేలికనుకుంటానండి."

"ఏమిటంత తేలిగ్గా అనేస్తున్నారు?"

"లేకపోతే! ఇంతమంది రచయితలు బయలుదేరుతారా? నేడు ఆ సాహిత్యానికున్న గిరాకీ ఏ సాహిత్యానికి ఉందండీ? నేను కొన్ని ఇంగ్లీషు డిటెక్టివ్ నవలలు చదివాననుకోండి. ఆ టెక్నిక్ ఏమిటో ఇట్టే బోధపడిపోయింది."

"షెర్లాక్ హోమ్స్ నవలలు చదివారా?"

"ఓ...అతగాడు రాసినవి ఒకటో రెండో చదివి ఉంటాను."

"అబ్బే...షెర్లాక్ హోమ్స్ రచయిత కాదండి. ఒక విఖ్యాత అపరాధ పరిశోధకుడు. ఆ పాత్రను సృష్టించింది సర్ ఆర్థర్ కానన్ డయల్."

"అలాగా!"

"మేధస్సుకు మారుపేరు షెర్లాక్ హోమ్స్. ఎన్నో క్లిష్టమైన కేసులను అవలీలగా పరిష్కరించాడు. ఎందరో నేరస్థులను పట్టుకున్నాడు. అన్యాయంగా ఉరికంబ మెక్కబోతున్న కొందరు నిర్దోషులను రక్షించాడు కూడా. నేరాలను దర్యాప్తు చేయడంలో ఆయనకు ప్రత్యేక పద్ధతులున్నాయి. వాటిల్లో పెక్కింటిని నేటి అపరాధ పరిశోధకులు అనుసరిస్తున్నారు కూడా."

"నిజంగా?"

"ఏ విషయంలోనైనా సరే - ప్రతి అంశాన్నీ తుణ్ణంగా పరిశీలించడం షెర్లాక్ హోమ్స్ స్వభావం... ఎక్కడైనా ఒకచోట హత్య జరిగిందనుకోండి. ఆ హత్యాప్రదేశాన్ని ఒకసారి అలా పరిశీలిస్తాడు, అంతే. వెంటనే హంతకుని ఆకారం, అతని దేహచ్ఛాయ, ఇత్యాది వివరాలన్నీ చెప్పేస్తాడు."

"అబ్బా!"

"అంతెందుకూ? ఇప్పుడు ఈ స్థితిలో మిమ్మల్నొకసారి చూస్తే చాలు — మీరు కాస్తో కూస్తో చదువుకున్నారని, ప్రస్తుతం నిరుద్యోగి అని, ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నారని, ఆర్థిక బాధలనించి గట్టెక్కడానికి ప్రస్తుతానికి డిటెక్టివ్ రచనలైనా సాగించే ఉద్దేశ్యంలో ఉన్నారని - ఇట్టే చెప్పేసి, మిమ్మల్ని చకితుల్ని చేయగలడు."

"తమాషాగా ఉందే!"

"మీరు నమ్మరులే కదూ? మీకో కథ చెప్తాను... ఒకసారి హోమ్స్, తన మిత్రుడొకడింటికి వెళ్ళాడు. ఒక గదిలో వాళ్ళిద్దరూ - మనం కూర్చున్నట్లే - ఇలాగే ఎదురెదురుగా కూర్చున్నారు. కిటికీగుండా బయట రోడ్డు కనిపిస్తోంది. ఆ దృశ్యం అచ్చం ఇలాగే ఉందనుకోండి ... ఇంతలో ఆ దారంట ఒక వ్యక్తి వస్తున్నాడు. అతని చేతిలో ఒక సంచి, కొన్ని పుస్తకాలు, నోట్ బుక్కులు ఉన్నాయి. అతనికి దాదాపు యాభై ఏళ్ళుంటాయి. ఆ వ్యక్తిని హోమ్స్ కొన్ని క్షణాలపాటే పరిశీలించాడు. అంతే. తర్వాత తన మిత్రునివైపు తిరిగి ఇలా అన్నాడు: 'ఆ మనిషిని చూడు. అతను తన జీవితంలో కొంతకాలాన్ని ఏ భారతదేశంలోనో గడిపి ఉండాలి. బహుశా మిలిటరీలో పనిచేసి ఉంటాడు. అతనికి భార్య లేదు', అని. హోమ్స్ చెప్పింది ఎంతవరకు నిజమో తెలుసుకోడానికి ఆ మిత్రుడు కుతూహలంతో - ఆ దారంట వెళ్తున్న మధ్య వయస్కుడ్ని పిలిచి, విచారించాడు. హోమ్స్ చెప్పిందంతా నూటికి నూరుపాళ్ళు కరెక్ట్ అని తేలింది."

"విచిత్రంగా ఉందే!"

"ఆ మిత్రుడు ఆశ్చర్యంలో మునిగి తేలుతూ, ఆ విషయాలన్నీ అంత కరెక్ట్‌గా ఎలా చెప్పగలిగావని హోమ్స్‌ను అడిగాడు. అప్పుడు హోమ్స్ ఇలా విపులీకరించాడు: 'ఇందులో ఏముందీ? ఆ మనిషి కాస్త నల్లగా ఉన్నాడా? అంచేత భారతదేశంలాంటి ఏ ఉష్ణమండలంలోనో ఉండి ఉండాలనిపించింది. అదే - భూమధ్యరేఖకు సమీపంగా ఉన్న ఏ ప్రాంతమో అయితే, అతను మరింత నల్లగా ఉండేవాడు. జుట్టు ఆ విధంగా ఉండదు. ఇక, అతని మెలితిరిగిన

కండరాలు, ఆ ఛాతీ చూస్తే - మామూలు కాయకష్టం చేసే మనిషిలా కాక — ఏ మిలిటరీలోనో మంచి కవాతుచేసిన మనిషి అయి ఉండాలని ఊహించాను. అతని చేతిలో నోట్ బుక్‌లూ అవీ ఉన్నాయిగా? అంచేత, అతనికి పిల్లలున్నారని అనుకోవాలి. కాని, అతని ముఖంలో జీవంలేదు. దాన్నిబట్టి - అతని భార్య గతించి ఉండాలని, పిల్లలను పెంచి పెద్దచేసే బాధ్యతంతా అతని నెత్తిమీదే పడిం దని అవగతమౌతుంది. అతని చేతిలో సంచి ఉందిగా? బజారునించి ఇంటికి కావలసిన సామానులను, పిల్లలకు కావ లసిన పుస్తకాలను కొనుక్కొని వస్తూం డాలి. అంతే' హోమ్స్ చెప్పింది సాంతం విన్నాక ఆ మిత్రుడు మరింత దిగ్భ్రాంతుడయ్యాడు."

"అయినా, ఇందులో అంతగా విస్మయం కలిగించే విషయం ఏముందో నాకు బోధపడడంలేదు. అపరాధ పరి శోధక రచనల్లో ఉండే విషయాలు ఇంత తేలికైనవైతే - రేపు ఉదయం లోగా నేను రెండు డిటెక్టివ్ నవలలు రాసి తీసుకొచ్చి మీకు చూపించ గలను."

"మీరు పొరబడుతున్నారు."

"లేదు... నా సామర్థ్యాన్ని మీరు పరీక్షించవచ్చు ... అదో - అలా రోడ్‌వైపు చూడండి. ఒక స్త్రీ వస్తోంది కదా? ఆమె చేతిలో గొడుగు ఉంది. మరొక చేతిలో ప్లాస్టిక్ బాగ్ ఉంది; అందులో కొన్ని పుస్తకాలు ఉన్నాయి. ఆమె ఇటు అటు చూడ కుండా - తల వొంచుకొని, ఆయా సంతో నడుస్తూండడం గమనించారా? ఆమె ఒక ప్రాథమిక పాఠశాలలో టీచరు. ఆమెకు భర్తా, ఒక కొడుకూ ఉన్నారు. ఆమె ఈవేళ మధ్యాహ్నం భోంచేయలేదు. ఈ పూట వాళ్ళింట్లో పొయ్యిలో పిల్లి పడుకుంది."

"బాబోయ్! ఆగండి - ఆగండి... నేను ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. మీరు హోమ్స్‌ను మించి పోయేటట్లున్నారే! ఇంతకీ, ఈ విషయాలన్నీ ఎలా ఊహించగలి గారో ఒక్కొక్కటిగా వివరించండి - చూద్దాం."

"ఆ తల వొంచుకుని నడవడం, ఆ నమ్రత చూస్తూంటే - సంసార స్త్రీలా ఉందికదా? హైస్కూల్ టీచరైతే ఆ నడకలో కాస్తో కూస్తో ఠీవి ఉంటుంది. ఇక ఆమె చేతిలోని ప్లాస్టిక్ బాగ్‌లో తెలుగు పుస్తకాలు ఉన్నట్లు కనిపిస్తున్నాయిగా? గొడుగు అక్కడక్కడ చినిగి ఉంది. తనే సంపాదించి, ఇంట్లోనివారిని పోషించే భారం తన నెత్తిమీద ఉండటంవల్ల కామోసు - ఆమె విచారవదనంతో ఉంది. మధ్యాహ్నం భోంచేయలేదు. అందుకే కళ్ళు ఎర్రబడి ఉన్నాయి. ఒంట్లో నీరసంగా ఉంది. అందుకే ప్రయాసతో నడుస్తోంది.

"మీరు చెప్పిందంతా బాగానే ఉంది. ఐతే, ఎంతవరకు నిజమో ఆమెను పిలిపించి కనుక్కుంటే బావుం టుందేమో ననిపిస్తోంది."

"ఎందుకు లెండి, సార్?"

"అబ్బే - అలా కాదు. ఒకవేళ మీరు చెప్పిన విషయాలన్నీ నిజమైతే - ఇందాక మీరు నన్ను పాతిక రూపా యలు అప్పు అడిగారు కదా? అప్పుగా కాక బహుమతిగా మీకు ఇచ్చేస్తా."

"ఐతే, ముందు ఇలా పడే య్యండి."

"కాస్త ఆగండి మరి. తొందర పడితే ఎలా? అదో ఆమె సందు మలుపు తిరగబోతోంది. వెళ్ళి, ఆమెను పిలిచి, అన్నీ కనుక్కో వాలా?"

"మీకా శ్రమేం అక్కర్లేదు, సార్! ఆమె నా భార్యే!"

"చచ్చాను పొండి."

"మరి, పాతిక ఇలా దయ చెయ్యండి!"

